కథ

# పులి వేట

## గన్నవరపు నరసింహమూర్తి



దట్టమైన అడవిలో టాటాసుమో దూసుకుపోతోంది. నాగరాజు బృందం పులివేటకు అందులో వెళుతోంది. నాగరాజు ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే కొడుకు. అతనికి పులివేటంటే మహా ఇష్టం. పులివేట నిషిద్ధమైనప్పటికీ, ఎమ్మెల్యే కొడుకు కాబట్టి అతనికి అడ్డు చెప్పే వాళ్లెవ్వరూ లేరు. అటవీశాఖ వారు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. ఇప్పటికి అతను నాలుగు పులుల్ని చంపాడని కొందరు, వాటితోపాటు మరో రెండు చిరుతల్ని కూడా చంపాడని మరికొందరు అనుకుంటూ వుంటారు. నాగరాజుకి పులివేట ఒక వినోదం. జీవితం ఒక ఆట. ఆరోజు వేటకు తన స్నేహితులను వెంటపెట్టుకొని బయలుదేరాడు. ఆ అడవంతా అతనికి కొట్టినపిండి.

అడవంతా పచ్చగా వుంది. అప్పుడే ఘాట్ రోడ్ ప్రారంభం అయింది. జీపు శబ్దం తప్ప అడవంతా నిశ్శబ్దంగా వుంది. అప్పుడప్పుడు పక్షుల కిలకిలరావాలు వినిపిస్తున్నాయి.

''నాగూ! మనం ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నాంరా?'' అప్పుడే నిద్రలోంచి మేల్కొన్న ప్రకాశం ఆవులిస్తూ అడిగాడు. అతను నాగరాజుకి క్లోజ్ ఫ్రెండ్.

''అయిందా...రా... నీ మొద్దు నిద్ర!? ఎప్పుడూ నీ బ్రతుకు నిద్రేరా. ఇప్పుడు మనం వెళుతున్నది ఎప్పుడూ వెళ్లే నల్లకొండ దగ్గరికి కాదు. దానికి పది కిలోమీటర్ల దూరంలో ఒక పెద్ద లోయ వుంది. అక్కడ ఒక వాటర్ ఫాల్ కూడా వుంది. అయితే ఆ వాటర్ ఫాల్ దగ్గరకి వెళ్లడం చాలా కష్టం. దానికి దగ్గర్లోనే వుండే తోపులోకి ఒక పులి తన పిల్లలతో సహా రోజూ వస్తోందని అసిరిగాడు కబురుపెట్టాడు. అక్కడికే ఇప్పుడు వెళుతోంది.

''పులి పిల్లలతో సహా వస్తోందా? అయ్య బాబోయ్! చాలా డేంజర్‌రా బాబూ! అయినా పిల్లలతో వున్న ఆపులిని చంపడం తప్పురా'' భయపడుతూ అన్నాడు ప్రకాశం.

''షటప్! నువ్వొక పెద్ద ఫూల్‌వి. వేటకు వెళుతూ దానిని తప్పన్నవాడు వేటకి పనికిరాడు రా. నువ్వు అనవసరంగా వచ్చావ్. ఆ రెస్ట్ హౌస్‌లోనే వుండిపోవలసింది'' విసుక్కుంటూ అన్నాడు శంకర్రావ్. అతను నాగరాజుకి మరో స్నేహితుడు.

ఇంతలో జీవు మర్రిగూడ జంక్షన్ దగ్గర ఆగింది. అక్కడికి మర్రిగూడ గ్రామం ఒక కిలోమీటరు దూరం వుంటుంది. అక్కడ ఓ పాతిక గిరిజన కుటుంబాలుంటాయి. ప్రకాశం ఊళ్లోకి వెళ్లి అసిరిగాడ్ని పిలుచుకు వచ్చాడు. అసిరిగాడు పులివేటలో దిట్ట. ఎప్పుడు వేటలో నాగరాజుకి సహాయపడుతుంటాడు. జీపు అసిరిగాడ్ని ఎక్కించుకొని మళ్లీ బయలుదేరింది. అసిరిగాడ్ని చూసి నాగరాజు అన్నాడు. ''ఏరా అసిరి! ఆ కొండ గెస్టు దగ్గర తోపులోకి రోజూ పులి వస్తోందట, నువ్వు చూసావుట కూడా, నిజమేనా?''

''సిత్తం దొరా! నేను సూణ్నేదు కాని దొరా! మా గూడెపోళ్లు కర్రలకని యెళ్తే ఆడ రెండు పులులు పిల్లలతో సహా వొచ్చాయంట''

''అయితే మనం ఇప్పుడు అక్కడికే వెళ్లాలా?'' నాగరాజు అడిగాడు.

''సిత్తం దొరా!''అంటూ అక్కడికి ఎలా వెళ్లాలో చెప్పాడు నాగరాజుకి.

అది ఒక లోయ. చుట్టూ కొండలు, దట్టమైన అడవి. ఎక్కడి నుంచో జలపాతపు హోరు వినిపిస్తోంది. దారి పొడవునా ఏపుగా పెరిగిన సిల్వర్ ఓక్ వృక్షాలు. నాగరాజు అక్కడ సూమోని ఆపాడు. ఆ తరువాతంతా కాలిబాటే. జీపు ఇక వెళ్లదు. నాగరాజు ప్రకాశాన్ని, శంకర్రావునీ ఆ జీపులోనే వుండమనీ, తనూ, అసిరిగాడు ఆ లోయ దగ్గరకి బయలుదేరారు. నాగరాజు దగ్గర అత్యంత అధునాతనమైన హంటింగ్ రైఫిల్ వుంది. దాన్ని అసిరిగాడికిచ్చి తాను హంటింగ్ స్టిక్ పట్టుకొని నడవసాగాడు. కొండ ఏటవాలుగా వుండడం వలన నడక కష్టమనిపిస్తోంది. అసిరిగాడికి ఆ అడవిలో నడక కొట్టినపిండే కావడంతో నాగరాజు వాడిని అనుసరిస్తున్నాడు. మధ్యాహ్నం అవుతుండగా ఆ జలపాతం వున్న ప్రదేశం చేరారు. అక్కడంతా పెద్ద పెద్ద చెట్లు, గుబురుగా పొదలు ఉన్నాయి. ఆ జలపాతం కొండమీద నుంచి దూకుతూ ఆ చెట్ల మధ్య నుంచి సాగిపోతోంది.

ఇంతలో అసిరిగాడు ఆ చెట్టు కింద వున్న గుర్తుల్ని చూపిస్తూ ''దొరా! ఇవే పులి గుర్తులు. రోజూ పులులు నీళ్లు తాగడానికి ఇక్కడకి వస్తుంటాయ్''అన్నాడు. నాగరాజు కూడా వాటిని చూశాడు. అక్కడ పులిపాదాల గుర్తులు, అవి పడుకున్నట్లు ఇసుకలో ముద్రలున్నాయి.

నాగరాజు, అసిరిగాడు అక్కడే వున్న చెట్టెక్కారు. ఆ చెట్టు గుబురుగా వుండి, కూర్చోవడానికి వీలుగా వున్నాయి కొమ్మలు. ఆ కొమ్మ మీద నుంచి కిందకు చూస్తే ఆ పులులు పడుకునే ప్రాంతం స్పష్టంగా కనిపిస్తోంది. నాగరాజుకి చాలా టెన్షన్‌గా వుంది. అప్పుడే అక్కడకొచ్చి రెండుగంటలకుపైగా అయింది. అయినా పులి జాడ లేదు. అతనికి అసహనం క్షణక్షణానికి పెరిగిపోతోంది. ఈలోగా సాయంత్రం అయింది. సూరీడు పశ్చిమాద్రికి కృంగిపోతున్నాడు. అడవిలోకి చూస్తే, ఎర్రటి కిరణాలు చెట్ల మధ్య నుంచి ఏటవాలుగా పడుతున్నాయి.

''ఏట్రా అసిరిగా, పులి మరి రాదంటావా?'' అసహనంగా అడిగాడు నాగరాజు.

''వస్తుంది దొరా! ఎప్పుడొస్తుందో చెప్పలేం. దప్పిక తీర్చుకోడానికి రావాలి కదా దొరా.'' అంటూ అసిరిగాడు అంటుండగానే పులి గాండ్రింపులు వినపడ్డాయి. నాగరాజు వెంటనే అలర్ట్ అయ్యాడు. ఎక్కడి నుంచో రెండు పెద్ద పులులు వాటి వెనుక వాటి పిల్లలు వరుసగా వచ్చేస్తున్నాయి. ఎప్పుడూ ధైర్యంగా వుండే నాగరాజుకి కూడా చెమటలు పట్టేస్తున్నాయి. అసిరిగాడు మాట్లాడొద్దని నాగరాజుకి సైగ చేశాడు. ఇప్పుడు పులులు వాళ్లు కూర్చున్న చెట్టు కిందకు వచ్చాయి. పెద్దపులులు రెండూ పారుతున్న గెడ్డలో నీళ్లు తాగుతుంటే, పిల్ల పులులు ఈత కొట్టసాగాయి. కొంచెం సేపటికి అవి విశ్రమించాయి. నాగరాజు ఇక ఆలస్యం చేయదల్చుకోలేదు.

''షూట్ చెయ్యనా?'' అని అసిరిగాడితో మెల్లగా అన్నాడు. అసిరిగాడు కిందకు మరోసారి చూస్తూ సరేనని తలూపాడు. అంతే. ఆ అడవంతా తుపాకీ శబ్దంతో ప్రతిధ్వనించింది. కానీ బుల్లెట్ గురి తప్పి పెద్దపులి కాలికి తగలడంతో అది ఒకటే గాండ్రింపుతో అటూ ఇటూ తిరగసాగింది. దాన్ని చూసి ఆ రెండో పులి, పిల్లపులులు కూడా గాండ్రించడం మొదలుపెట్టాయి. నాగరాజుకి, అసిరిగాడికి వాటిని చూశాక ముచ్చెమటలు పోస్తున్నాయ్. కొంప తీసి దెబ్బతిన్న పులిగానీ తమని చూసిందా? అన్న భయం నాగరాజుకి పట్టుకొంది. కొద్దిసేపటికి అవి గాండ్రించుకుంటూ తోపుల్లోకి పారిపోయాయి. అవి పారిపోయిన అరగంట దాకా ఆ చెట్టు మీదే ఇద్దరూ ముడుచుకొని కూర్చున్నారు. తరువాత అంతా నిశ్శబ్దం.

ఇంక పులుల భయం లేదని నిర్ధారించుకొని నాగరాజు, అసిరిగాడు చెట్టు దిగి చుట్టూ చూశారు. అక్కడంతా రక్తపు మరకలు కట్టి వున్నాయి. పులికి పెద్ద దెబ్బే తగిలిందన్న అనుమానం కలిగింది నాగరాజుకి. ఇంక అక్కడ ఎక్కువ సేపు వుండడం ప్రమాదమని తలచీ ఇద్దరూ వడివడిగా జీపు దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. వస్తున్నంత సేపూ ఆ పులి వెంటపడుతుందేమోనని వెనక్కు చూస్తూనే వున్నాడు నాగరాజు. పరిగెత్తుకుంటూ వస్తున్న వాళ్లిద్దర్నీ చూసి ప్రకాశం జీపులోంచి దిగి ఆదుర్దాగా అడిగాడు 'ఏమైందిరా? పులి చచ్చిందా?' అని. నాగరాజు సమాధానం చెప్పలేదు. అతని ముఖం సీరియస్‌గా వుండడంతో అతనేమీ తిరిగి ప్రశ్నించక మౌనంగా ఉండిపోయాడు ప్రకాశం. ఈ లోగా జీపుని నాగరాజు స్టార్ట్ చేసి స్పీడుగా పోనిచ్చాడు. జీపు వెళుతున్నంత సేపూ ఎవ్వరూ మాట్లాడే సాహసం చెయ్యలేదు. అంతా నిశ్శబ్దం. నాగరాజు అంత సీరియస్‌గా వుండడం వాళ్లెప్పుడూ చూడలేదు. అసిరిగాడిని మర్రిగూడ జంక్షన్ దగ్గర దించేసి, వాళ్లు పట్నం వైపు సాగిపోయారు.

★★★

ఆర్నెల్లు గడిచాయి. క్రితం సారి వేట విఫలం అవడంతో నాగరాజు చాలా కోపంగా వున్నాడు. తన జీవితంలో వేట విఫలం అన్నది అదే మొదటి సారి. ఇంకోసారి వేటకెళ్లి పులిని చంపాలన్న కసితో వున్నాడతను. అందుకే సరైన సమయం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో పులి మళ్లీ అక్కడే సంచరిస్తోందని, వెంటనే బయలుదేరి రావాలని అసిరిగాడ్నించి పిలుపొచ్చింది.

ఇంక ఆలస్యం చెయ్యకుండా మళ్లీ అదే మిత్ర బృందంతో బయలుదేరాడు నాగరాజు. ఈసారి ముందుగానే వెళ్లి ఫారెస్టు గెస్ట్ హౌస్‌లో దిగారు వారంతా. వాచ్‌మెన్ చేత అసిరిగాడికి కబురు పంపాడు నాగరాజు. అసిరిగాడు ఆ సాయంత్రమే వచ్చాడు.

''ఏరా అసిరిగా, మళ్లీ ఆ పులి కనిపించిందా?'' ఆత్రంగా అడిగాడు నాగరాజు.

''మీరెళ్లిన తరువాత మా గూడెపోళ్లను అటుగా ఎళ్లొద్దని సెప్పాను దొరా, కానీ మొన్న

మా సిన్నాన్న అటుగా ఎళితే పులి గాండ్రిపులు ఇనిపించాయట. కాబట్టి పులులు అక్కడికొస్తున్నాయని నా అనుమానం'' కొంచెం నసుగుతూ చెప్పాడు అసిరిగాడు.

''ఒరేయ్ అసిరీ! రేపు ఉదయాన్నే మనం అక్కడికి వెళుతున్నాం. ఈసారి దాన్ని వదిలిపెట్టను'' కసిగా అన్నాడు నాగరాజు.

''సరే దొరా! కానీ చాలా జాగ్రత్తగా వుండాలి. దెబ్బ తిన్న పులి కదా!''

''సర్లే... అలాగే కానీ నువ్వు ఉదయాన్నే మీ జంక్షన్ దగ్గరికొచ్చేసేయ్''అన్నాడు నాగరాజు.

★★★

తెలతెలవారుతుండగానే నాగరాజు మిత్ర బృందం, అసిరిగాడు ఆ లోయ దగ్గరకు బయలుదేరారు. గంట తర్వాత వాళ్లు ఆ కొండ వాగు దగ్గరికి చేరాడు. కొంచెం దూరంలో జీపు ఆపి, శంకర్రావునీ, ప్రకాశాన్ని జీపు దగ్గర వదిలేసి అసిరిగాడ్ని తోడుగా తీసుకెళ్లాడు నాగరాజు. మళ్లీ అదే చెట్టు మీద కాపు కాసారు వాళ్లిద్దరూ. మధ్యాహ్నం అయింది. పులిజాడ లేదు. మాట్లాడితే భయం. సంజ్ఞలు చేసుకుంటున్నారు. తెచ్చుకున్న బిస్కట్లు కొద్దిగా తిన్నారు. నాగరాజుకి విపరీతమైన టెన్షన్‌గా వుంది. ఈసారి అది వస్తే గురి తప్పకూడదు. అవసరమైతే వాటినన్నింటిని కాల్చి పారేయాలి. అతని ముఖంలో కసి స్పష్టంగా కనిపిస్తోంది.

ఆలోచిస్తూ ఎటో చూస్తున్న నాగరాజు చూపు దూరంగా వస్తున్న పులి మీద పడింది. ఈసారి ఒక్క పులే వస్తోంది. నాగరాజు అసిరిగాడికి దాన్ని చూపించాడు. అది తిన్నగా వచ్చి గెడ్డలో నీరు తాగింది. తరువాత కొద్దిసేపటికి వీళ్లు కూర్చున్న చెట్టు కిందకు వచ్చి నిలబడింది. సరిగ్గా పులి తమ కిందే వుంది. ఆ పులిగానీ తల పైకెత్తితే తామిద్దరూ కనిపిస్తారు. అంత క్లోజ్ రేంజ్‌లో వున్నారు. నాగరాజు ఇక ఆలస్యం చెయ్యదల్చుకోలేదు. అసిరిగాడు తొందరపడొద్దని వారించాడు. నాగరాజుకి ఆ పులిని చూస్తుంటే ఇదివరకు తాను కాల్చిన పులేమోనని అనుమానం వేసింది. అదీ కాక అది కుంటుకుంటూ వచ్చింది. ఇంతలో మళ్లీ గాండ్రింపు వినిపించింది. నాగరాజు ఉలిక్కిపడ్డాడు. ఇంతలో మరో పులి అక్కడకి చేరుకుంది. నాగరాజు ఒక నిశ్చయానికి వచ్చాడు. రెండు గుళ్లతో రెండింటినీ చంపెయ్యాలని అనుకున్నాడు. తుపాకీని ఓ పులికి గురిపెట్టాడు. అతని చేతివేలు ట్రిగ్గర్ నొక్కడానికి సిద్ధంగా వుంది. క్షణాలు గడుస్తున్నాయి.

★★★

దూరంగా జీపులో కూర్చున్న శంకర్రావు, ప్రకాశంలకు అసహనంగా వుంది. సుమారు ఐదుగంటలవుతోంది. అక్కడేం జరుగుతుందో తెలియదు. తుపాకీ పేలితే వినిపించేటంతటి క్లోజ్ రేంజ్‌లో వాళ్లున్నారు. కానీ అటువంటి శబ్దాలేవీ వినిపించలేదు. క్షణక్షణానికి వారిలో ఆందోళన పెరిగిపోతోంది. ఇంతలో పెద్ద పెద్ద అరుపులు నాగరాజువిలా వున్నాయి. ''అమ్మో! రక్షించండి'' అన్న ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగుతోంది. కాసేపటికి ఆ అరుపులు ఆగిపోయాయి. అంతటా ఒక్కసారిగా నిశ్శబ్దం. మరోపావుగంటకి అసిరిగాడు రొప్పుకుంటూ వస్తున్నాడు. వాడు తిన్నగా జీపుదగ్గరకొచ్చి ''బాబూ! అన్యాయం జరిగిపోయింది. నా కళ్లముందే ఆ పులి నాగరాజు బాబు పీక నోటకరుచుకొని అడవిలోకి ఈడ్చుకు పోయింది బాబూ!'' అంటూ ఏడవసాగాడు.

''పులి ఈడ్చుకు పోయిందా?! అయ్యో! ఎలా జరిగిందిరా? మీరిద్దరూ చెట్టుమీదే కదా వున్నారు? నాగుచేతిలో గన్ వుందిగా....అది పేల్చలేదా?''అతన్ని కుదిపేస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు ప్రకాశం, శంకర్రావులు.

''ఏం సెప్పను దొరా.. ఆ బాబూ, నేనూ కూర్చున్న చెట్టు కిందే ఆ రెండూ పులులు వున్నాయి. బాబుగారు వాటిని కాలుస్తానని తుపాకీ నొక్కుతుండగా చెట్టు మీంచి జారి కిందకు పడిపోయారు. అంతే.... నా కళ్ల ముందే ఆ పులి నాగుబాబు మెడను కరుచుకొని అడవిలోకి పారిపోయింది దొరా''అంటూ అసిరిగాడు ఏడవసాగాడు.



''నేను కూడా దాని వెంట పరిగెత్తాలనుకున్నాను. కానీ ఆ రెండో పులిని చూసి భయపడి పోయాను.''

ఈ విషయం మరో గంటలో రాష్ట్రమంతటా తెలిసిపోయింది. గంట తర్వాత ఫారెస్ట్ రేంజర్, గార్డు, ఆ ఏరియా సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు అందరూ వచ్చి నాగరాజు శవం కోసం వెదికారు. అదెక్కడా దొరకలేదు. అతన్ని ఈడ్చుకెళ్లినట్లు గుర్తులు దారి పొడవునా రక్తపు మరకలు కనిపించాయి. అవి కొంత దూరం వరకు మాత్రమే వ్యాపించి, ఆ తరువాత పొదల దగ్గర ఆగిపోయాయి. చేసేదేం లేక వాళ్లు వెనుతిరిగారు. ఎమ్మెల్యేగారబ్బాయి నాగరాజుని పులి చంపేసిందన్న వార్త రాష్ట్రమంతటా దావానలంలా వ్యాపించింది. రాష్ట్రంలో ఈ వార్త పెను సంచలనం సృష్టించింది. అందునా అధికారపార్టీ ఎమ్మెల్యే కావడంతో అక్కడి పోలీసుల మీద విపరీతమైన వత్తిడి వచ్చింది.

నాగరాజు స్నేహితులు ప్రకాశం, శంకర్రావులిద్దరూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అసిరిగాడి మీద అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అసిరిగాడిని అదుపులోకి తీసుకొని, విచారణ మొదలుపెట్టారు. చెట్టు మీద నుంచి జారిపడిపోయాడని వాడుచెప్పిన విషయం నమ్మశ్యకంగా లేకపోవడంతో వాళ్లు అసిరిగాడి మీద లాఠీదెబ్బ ప్రయోగించడంతో వాడు బెంబేలు పడిపోయాడు. ఆ స్టేషన్ ఎస్సై రసూల్‌కి కర్కోటకుడు అని పేరు. నిజం చెప్పే దాకా అతని లాఠీ వూరుకోదు. మొదట నాకేం తెలియదని అసిరిగాడు బుకాయించినా, లాఠీదెబ్బలు సహించలేక నిజం చెప్పడం మొదలుపెట్టాడు.

★★★

''నాగరాజు బాబు ఎప్పుడూ ఈ అడవికే ఏటకొచ్చేవాడు. ఎప్పుడొచ్చినా నన్నే తనతో తీసుకెళ్లేవాడు. అలాగే ఆరునెలల క్రితం ఏటకొచ్చినప్పుడు చెట్టు మీద నుంచి పులిని కాల్చగా అది గురితప్పడం వల్ల కాలుకి తగిలి అవి తప్పించుకున్నాయి. ఆ రోజు ఆ బాబు చాలా భయపడిపోనాడు. ఆ బాబుతో పాటు నేనూ శానా భయపడిపోనాను!

''నీకెందుకు భయం?''రసూల్ అడిగాడు.

''బతుకు బయం బాబూ''

''బతుకు భయమా?''అర్థం కానట్లుగా చూశాడు రసూల్.

''అవును బాబూ! బతుకు బయమే! అడవిలో పులులున్నాయంటేనే నాగరాజు బాబులాంటోళ్లొచ్చేది. నన్ను పిలిసేది! ఏటలో ఆళ్లెంటున్నానంటే నాకు కానో,పరకో కిడతాది! అందులో అనుమానం లేదు! ఆటితోనే ఇన్నాళ్ళూ ఉందీ నేదు! నేదూ వుందని బతుకీడుస్తున్నాను అడవిలో పులులుంటేనే బాబూ నాకు బతుకు! అయేపోయాయనుకో! బతుకుందా? సెప్పు'' దీనంగా అడిగాడు అసిరిగాడు.

అడవిలో పులులు లేకపోతే అసిరిగాడికి బతుకు లేదా? పులులు వుంటేనే బతుకా? ఏంటిదంతా? అసలేం జరిగింది?

అయోమయంగా వుంది రసూల్‌కి. అతనికేం పాలుపోవట్లేదు.

''అందుకే బాబూ! అందుకే...నాగరాజు బాబుని పులికి అప్పగించేసినాను'' ఏడుస్తూ చెప్పాడు అసిరిగాడు.

''అప్పగించేశానంటే...''అనుమానంగా అడిగాడు రసూల్.

''అప్పగించేసినానంటే.... ఇంకేట్నేదు బాబూ! నాగరాజు బాబుని నాను నాసేతుల్తోనే చెట్టు మీంచి కిందికి తోసేసి, పులికెరేసి సంపేసినాను''గొల్లుమన్నాడు అసిరిగాడు. అసిరిగాడు చెప్పిన దానికి రసూల్‌కి గుండె 'ఝల్'మంది.

నాగరాజు తుపాకీ కాలుస్తూ బ్యాలెన్స్ తప్పి చెట్టు మీద నుంచి జారి పడలేదు. అసిరిగాడు... అసిరిగాడే నాగరాజుని చెట్టు మీద నుంచి తోసేశాడు. ఎందుకు చేశాడా పని?!

ఆ మాటే అసిరిగాడ్ని అడిగాడు రసూల్.

''ఎందుకు సేశానంటే... అడవిలో పులులుంటేనే, నాగరాజు బాబులాంటి వాళ్లొస్తారు. యేటకి నన్ను ఎంటెట్టుకుని వెళ్తారు. ఎంటొచ్చినందుగ్గాను ఆళ్లు నాకు కానో, పరకో ఇస్తారు. ఆటితోనే నా బతుకు! పులులంటూ ఉంటేనే అసిరిగాడు లాంటోళ్లు బతుకుతారు. అయి పోతే.. మాలాంటోళ్లకి బతుకేనేదు!

అడవిలో పులులుండాలి! పట్నంలో నాగరాజు బాబులాంటి ఏట సరదా వున్న దొరలుండాలి! ఉంటేనే నాలాంటోళ్లు బతుకుతారు! అదే అడవిలో పులులు నేకపోతే మేం ఎలా బతుకుతాం? ఏట పేర్న ఆట్ని సంపేత్తే మొదటికే మోసం రాదా'' ఆగాడు అసిరిగాడు.

అంటే? నాగరాజులాంటి వాళ్లు అడవికి వేటకు రావాలి కాని, పులుల్ని వేటాడకూడదు! చంపకూడదు! అంతేనా?అదేనా అసలు విషయం...

ఆలోచిస్తున్న రసూల్‌తో–

''సరదా వుండాలి కానీ, ఏటాడకూడదు బాబూ! మన జోలికి పులి రానప్పుడు, పులి జోలికి మనమెందుకు బాబు ఎళ్లడం? తప్పు కాదా! ఆర్నెల్ల కితం నాగరాజు బాబు కొట్టిన తుపాకీ దెబ్బకి పాపం పులి అల్లాడిపోనాది! దాని గోలా, బాదా ఆర్నెల్ల పాటు ఇనలేకపోయా! దాన్నిగదరగ... ఆ కసంతా తీర్చుకున్నాను బాబూ! నాగరాజు బాబుని పులికి తిండెట్టేశాను'' అన్నాడు అసిరిగాడు.

ఆ మాట చెపుతున్నప్పుడు అసిరిగాడు కళ్లు కసితో ఎర్రబడడం స్పష్టంగా గమనించాడు రసూల్.

ఒక వైపు అడవిలో జంతువుల మీద ప్రేమ, మరో వైపు బతుకు భయం, వాటి కారణంగానే నాగరాజుని అసిరిగాడు చంపేశాడు. అయితే ఈ మాట పైకి అనకూడదనుకున్నాడు రసూల్. నిజం చెప్పినందుకు అసిరిగాడిని అతడు కాపాడాలనుకున్నాడు. చేతిలోని లాఠీని విసిరి, నుదుటికి పట్టిన చెమటని తుడుచుకొని, లాకప్‌లోంచి బయటకొచ్చి–

''చెట్టు మీద నుంచి పులిని కాలుస్తుండగా నాగరాజు ప్రమాదవశాత్తు జారిపడిపోయాడనీ, అందువల్ల పులిచే చంపబడ్డాడని అసిరిగాడి దగ్గర స్టేట్‌మెంట్ తీసుకొని వాడిని వదిలేయండి'' అని కానిస్టేబుల్‌తో చెప్పాడు రసూల్.

నాలుగు రోజుల తరువాత 'నాగరాజు పులి వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి జారి పడిపోవడం వల్ల పులిచే చంపబడ్డాడు' అని ఎఫ్ఐఆర్ రాసి ఆ కేసును క్లోజ్ చేసేశారు పోలీసులు.

★

